క్లుప్తంగా

రేపు ఎమ్మెల్యే వాసుబాబు నామినేషన్


పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

గణపవరం: ఉంగుటూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పుప్పాల వాసుబాబు ఈనెల 25న గురువారం తన నామినేషన్ దాఖలు చేస్తారని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం గణపవరం నుంచి భారీ ప్రదర్శనగా ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారని వారు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేడు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రచారం

పెదవేగి : పెదవేగి మండలం నడిపల్లి, బాపిరాజుగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలం పార్టీ అధ్యక్షుడు జానంపేటబాబు అన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించే ఎన్నికల ప్రచారానికి ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జానంపేట బాబు కోరారు.

విద్యుత్ వెలుగుపై హర్షం


పెదవేగి దళితవాడలో ఎంపీపీ తాతా రమ్య ఆదేశాలతో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

పెదవేగి : స్థానిక దళితవాడలో సెయింట్ అడోనై గాస్పెల్ చర్చికి వెళ్లే ప్రధాన రహదారి కొద్ది రోజులుగా చీకటిమయంగా మారింది. ఈ విషయాన్ని పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోకపోవడంతో ఎస్సీ ఏరియా వైఎస్సార్ సీపీ యూత్ పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంపీపీ మంగళవారం ప్రధాన రహదారి వెంబడి 5 లైట్లు, సరిపడ వైర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం విద్యుత్ వెలుగులు రావడంతో చర్చికి వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఎస్సీ ఏరియా వైఎస్సార్ సీపీ యూత్ అభినందించి, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధ్యాయులపై సామాజిక బాధ్యత


పార్వతీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గణపవరం: ఉపాధ్యాయ వృత్తి కేవలం విద్యా బోధనకే పరిమితం కాదని, సమాజాన్ని సక్రమంగా ముందుకు తీసుకెళ్లే సామాజిక బాధ్యత కూడా వారిపై ఉందని పలువురు అన్నారు. గణపవరం మండలం ఎ.గోపవరం యూపీ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసి పదవీ విరమణ పొందిన పార్వతీదేవిని మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గణపవరం ఎంఈవోలు పి.శేషు, జిబాలయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొని ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే పాఠశాలలకు ఆదరణ ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో అఖిల భారత జర్నలిస్టు యూనియన్ మాజీ అధ్యక్షుడు డి.సోమసుందర్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ నారాయణ, మండల శాఖ అధ్యక్షుడు విజయబాబు, హెచ్ఎం నక్కా రాంబాబు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


బి.శ్రావణి (507)


ఎం ఎస్తేరు రాణి (506)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల విద్యార్థినులు అత్యద్భుత ప్రతిభ కనబరిచారని సమగ్రశిక్ష అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడుల్లో ఉన్న మూడు కస్తూరిబా బాలికా విద్యాలయాల నుంచి 100 మంది పరీక్షలు రాయగా 95 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వీరిలో బి.శ్రావణి (వేలేరు కేజీబీవీ) 507, ఎం.ఎస్తేరు రాణి (వేలేరుపాడు కేజీబీవీ) 506 మార్కులు సాధించారని తెలిపారు. కేజీబీవీల విద్యార్థినులు 95 శాతం ఫలితాలు రాబట్టడంలో కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా

- నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలి రండి
- పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వాసుబాబు


గణపవరం: వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: సేవకుడిగానే పని చేస్తానని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఈనెల 25న నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని వైఎస్సార్ సీపీ శ్రేణులను వాసుబాబు కోరారు. మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభిమానులు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆయన అన్నారు. గెలుపే లక్ష్యంగా శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు మాట్లాడుతూ వాసుబాబును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గణపవరం: ఉంగుటూరు అసెంబ్లీ స్థానానికి ఈనెల 25న తాను నామినేషన్ దాఖలు చేస్తానని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ ముఖ్యనేతలు, గ్రామ కమిటీలు, బూత్ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణపవరం మండలం సరిపల్లె శివారు ఐస్‌ఫ్యాక్టరీ దగ్గర నుంచి ఉదయం 8.30 గంటలకు ర్యాలీ ప్రారంభమై, గణపవరం, బువ్వనపల్లి, నిడమర్రు, నారాయణపురం, మీదుగా ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం చేరుతుందన్నారు. గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన అన్ని గ్రామాల పార్టీ శ్రేణులు గణపవరం ఉదయం 8 గంటలకు చేరుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులంతా ర్యాలీలో పాల్గొనేలా చూడాలన్నారు. నాలుగు మండలాలనుంచి భారీ సంఖ్యలో నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేలా పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు.

ఈ సమావేశాల్లో వైఎస్సార్ సీపీ పార్టీ నియోజకవర్గ పరిశీలకుల జయప్రకాష్, టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పుప్పాల గోపి, పెనుగొండ బాలకృష్ణ, దొంతంశెట్టి సత్యనారాయణ, బళ్ల త్రిమూర్తులు, ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు దండు రాము, సంకు సత్య కుమార్, జిల్లా రైతు సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు నడింపల్లి సోమరాజు, సరిపల్లె చిన్నా, వంకాయల రామారావు, మారిశెట్టి అబ్బులు, సంకునాగేషు, సమయం వీరరాఘవులు, కాన్వెంట్ శ్రీను పాల్గొన్నారు.

26న ఏలూరులో యాదవుల ఆత్మీయ సమ్మేళనం


యాదవుల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కొలుసు గణపతిరావు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 26న శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో యాదవుల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని యాదవులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొవ్వలి ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి, పార్టీ దెందులూరు యువజన విభాగ దెందులూరు మండల అధ్యక్షుడు గౌరిపర్తి శ్రీను, మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ ఉన్నారు.

గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం


చెట్టున్నపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక

భీమడోలు: మండలంలోని చెట్టున్నపాడు, పోలసానిపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని కోరుతూ నాయకుల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పార్టీ శ్రేణులు ఉత్సాహంతో గడప గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందని, ప్రతి ఒక్కరూ తమ ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి పార్టీ అభ్యర్థుల విజయానికి దోహదపడాలని కోరారు. చెట్టున్నపాడులో మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేసారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొల్లేరు వాసులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పోలసానిపల్లిలో మంగళవారం రాత్రి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలోని బీసీ కాలనీలో 11, 12 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

'పది'లో సత్తా చాటిన విద్యార్థులకు సత్కారం


విజయరాయి ఉన్నత పాఠశాల్లో ప్రథమ స్థానం విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు


కొప్పాక ఉన్నత పాఠశాల్లో మొదటి మూడు స్థానాల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదవేగి : ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విజయరాయి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం. హేమ శ్రీ వరలక్ష్మికి 547 మార్కులు వచ్చాయని, పాఠశాలలో విద్యార్థులు 76 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యా కమిటీ చైర్మన్ బైగాణి రంగారావు మంగళవారం తెలిపారు. అత్యధిక మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని హేమ శ్రీ వరలక్ష్మిని ప్రధానోపాధ్యాయురాలు వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులను సర్పంచ్ గొట్టాపు కృష్ణవేణి. ఉప సర్పంచ్ లీగల్ శివరామకృష్ణ, పీబీ శ్రీనివాసకృష్ణ, మంతెన కిషోర్, బొమ్మ రెడ్డి చంద్రారెడ్డి, పులగం వేణుగోపాల్ రెడ్డి తదితరులు అభినందించారు.

కొప్పాక ఉన్నత పాఠశాలలో మొత్తం 120 మంది పది పరీక్షలు రాయగా, 74 మంది ఉత్తీర్ణత సాధించగా, 46 మంది ఫెయిల్ అయ్యారని హెచ్ఎం శైలజ చెప్పారు. పాఠశాల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. రాయపాటి జాహ్నవి 558, రేలంగి ఫణిశ్రీ దుర్గ 535, దోనె అజయ్‌బాబు 530 మార్కులు సాధించారని తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన అందరి బాధ్యత



పోలసానిపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి సూచనలందిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ట, రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు కె.శ్రీలక్ష్మీ, జాహ్నవి.

భీమడోలు: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన అందరి బాధ్యత అని, ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు దీనికి దోహద పడతాయని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ట అన్నారు. ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా పోలసానిపల్లి-1 పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాలకు రోగులు పోటెత్తారు. పంచాయితీ పరిధిలోని రోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. శిబిరంలోని రోగులకు అందుతున్న సేవలను ఆమె పరిశీలించి వైద్యుల నుంచి వివరాలు అడిగితెలుసుకున్నారు. భీమడోలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి పలు సూచనలందించారు. ఈ శిబిరంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ డాక్టర్ ఎం.సునీతతో పాటు పలు విభాగాలకు చెందిన వైద్య బృందం 395 మందికి వివిధ పరీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. భీమడోలు సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు ఎం.సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన బాలింతలు, గర్భిణులు, కౌమార, నవజాత శిశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి, జనరల్ విభాగపు వైద్యులు కె.శ్రీలక్ష్మీ, కె.జాహ్నవి, హరితశ్రీ వైద్య సేవలందించారు. కంటి వైద్య నిపుణులు ఐదుగురికి కంటి పరీక్షలు చేశారు. అప్మాలజిస్ట్ దివ్య, సీహెచ్‌వో, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందనలు


క్రీడాకారిణిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి ఆటల పోటీల్లో రాణించడం సంతోషంగా ఉందని హెచ్ఎం జి.సునీత అన్నారు. రెండు రోజుల క్రితం నూజివీడులో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన పాఠశాల క్రీడాకారిణులను అభినందించారు. కార్యక్రమంలో సునీత మాట్లాడుతూ కొన్నేళ్లుగా పాఠశాల విద్యార్థులు పలు క్రీడాంశాల్లో రాణిస్తున్నారని, ఇందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ప్రసన్న చేస్తున్న కృషి వెలకట్టలేమని తెలిపారు. క్రీడాకారిణిలను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్త్ టాపర్స్‌కు సన్మానం


విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన మాదేపల్లి పాఠశా ల విద్యార్థులను హెచ్ఎం ఎస్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. స్కూల్ స్థాయిలో మొదట మూడు స్థానాల్లో నిలిచిన జీఎల్ఎస్ కృష్ణ (573), వై నేహ (570), బి.అభిలాష్ (540) లకు శాలు వ కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించి తోటివిద్యార్థుల్లో స్ఫూర్తి నింపారని ఉపాధ్యాయులు పువ్వుల అంజనేయులు టాపర్లను కొనియాడారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన సీతంపేట జనసేన శ్రేణులు


ఎంపీ శ్రీధర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో సీతంపేట జనసేన శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్న దృశ్యం


మాదేపల్లిలో అబ్బయ్యచౌదరిని అభినందిస్తున్న యోరూషలేం సంఘీయులు

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలంలోని సీతంపేట గ్రామంలో జనసేన పార్టీ ఖాళీ అయింది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కార్యాలయంలో సీతంపేట జనసేన పార్టీ నాయకులు వెంపా బాలు, తాడేపల్లి చింటూ, చెట్టిమాల చిట్టి, గొటుకుల వివేక్, కాలి నరేష్‌ల మెడలో కండువాలు వేసి ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు ఉదయ్‌భాస్కర్ ఉన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి క్రైస్తవుల మద్దతు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గం అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరికి క్రైస్తవులు మద్దతు తెలిపారు. సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పీవీ రావు ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో యోరూషలేం ప్రార్థన మందిరం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పీవీ రాజు మాట్లాడుతూ సౌమ్యుడు, విద్యావంతుడైన అబ్బయ్యచౌదరి హయాంలో దెందులూరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం అబ్బయ్యచౌదరిని గజమాలతో అభినందించారు. కార్యక్రమంలో పీవీ సాయిబాబా, మండల కొండలరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ శంకరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని మద్దుల వారి సత్రం, చుండూరి వారి సత్రం, మహాదాస్యం చూడుకుడుత్తమ్మ సత్రాల నిధులతో స్థానిక దేవదాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయా సత్రాల కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు మంగళవారం ప్రారంభించారు. స్థానిక ప్రజలు, పాదచారులకు దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వేసవి ముగిసే వరకు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. దేవదాయ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నారాయణపురం హైస్కూల్లో 88శాతం ఉత్తీర్ణత


నారాయణపురం హైస్కూలు విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం మీరాసాహెబ్, ఉపాధ్యాయులు

ఉంగుటూరు: నారాయణపురం హైస్కూలు విద్యార్థులు పదవ తరగతిలో 88 శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం మీరాసాహెబ్ అన్నారు. పాఠశాల విద్యార్థులు గోపి వెంకటసాయి 578, పొన్నాడ పవన్‌కుమార్ 577, నక్కాసాయి శ్రీనివాస్ 575 మార్కులు సాధించారని వెల్లడించారు. పదవ తరగతిలో 114 మంది పరీక్షలు రాయగా 100 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. 500 పైగా మార్కులు 12 మంది సాధించారని హెచ్ఎం తెలిపారు. తెలుగు, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో వంద మార్కులు పాఠశాల విద్యార్థులు సాధించడం విశేషం. హిందీలో 96 మార్కులు, ఇంగ్లీషులో 93 మార్కులు, సైన్సులో 98 మార్కులు సాధించారని హెచ్ఎం చెప్పారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మానసిక ఆరోగ్యానికి పుస్తకం దివ్య ఔషధం


భీమడోలు లైబ్రరీలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: మానసిక ఆరోగ్యానికి పుస్తకమని దివ్య ఔషధమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని పుస్తకం పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ పుస్తకం వల్ల ఒక వ్యక్తి శక్తిగా, బలమైన ఆయుధంగా మారతాడన్నారు. నేటి సమాజంలో పుస్తకాన్ని వీడి సాంకేతిక పోకడలతో సెల్‌పై మోజుతో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువ సమయాన్ని పుస్తకాలు చదవడానికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా


ఎమ్మెల్యే నానిని కలిసిన వలంటీర్లు

ఏలూరు టౌన్: ఏలూరు 21వ డివిజన్‌లోని 37, 38 సచివాలయాల వలంటీర్లు 11 మంది స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. వీరంతా శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు వలంటీర్లను గోనెసంచులు మోసుకునేవారు అంటూ హేళన చేయగా, పవన్‌కల్యాణ్ వలంటీర్లను మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారంటూ కించపరిచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్ల నాని విజయానికి కృషి చేస్తామని వలంటీర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ వలంటీర్ల త్యాగాలు వృథా పోవని, రానున్న జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లకు సముచిత స్థానం కల్పిస్తామని భరోసా కల్పించారు. నూకపెయ్యి సుధీర్‌బాబు, అన్నపునేని రవికుమార్, వరికూటి మహేష్, ప్రత్తిపాటి తంబి, వితల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

26న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రరావు పేట, రమా మహల్ సెంటర్, సుబ్బమ్మదేవి స్కూల్ ప్రాంతం, కొత్తపేట, చేపల తూము సెంటర్, పవర్‌పేట స్టేషన్ రోడ్డు, చాణక్యపురి కాలనీలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

భూముల వందు పేర్చం చేసుకునే హక్కునకు టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర. సం.	భూమి ఉన్న సర్వే నెం. గ్రామము		విస్తీర్ణం ఎ.సెం.	ధరావత్తు రు.	లీజు కాలపరిమితి	వేలంపాట జరుగు తేది, సమయము మరియు ప్రదేశం
1	[illegible]	178/3 192	[illegible]	5,000/-	[illegible]	[illegible]
2	[illegible]	114/2	[illegible]	5,000/	[illegible]	[illegible]
3	[illegible]	[illegible]	[illegible]	5,000/-	[illegible]	[illegible]
4	[illegible]	193	[illegible]	10,000/-	[illegible]	[illegible]
5	[illegible]	[illegible]	[illegible]	2,000/	[illegible]	[illegible]
6	[illegible]	[illegible]	[illegible]	2,000/	[illegible]	[illegible]
7	[illegible]	[illegible]	[illegible]	15,000/	[illegible]	[illegible]
8	[illegible]	200/1	[illegible]	10,000/-	[illegible]	[illegible]

[illegible]

ఏలూరు, ది.16.04.2024 ఇట్లు : కార్యనిర్వహణాధికారి సెల్ : 98669 75779

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com